# ఈ నెల 8న 6కె రన్

- 60 వసంతాలు పూర్తి చేసుకొనున్న సందర్భంగా ఏర్పాటు
- సెంట్రల్ పార్క్ నుంచి ప్రకాశం స్టేడియం వరకు నిర్వహణ
- ఫిబ్రవరి 4వ తేదిన పాఠశాల పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం
- ఫిబ్రవరి 5వ తేదిన పాఠశాల వజ్రోత్సవ సంబరాలు
- విలేకరుల సమావేశంలో సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్సిపల్ రాజశేఖర్‌రెడ్డి




**శామ్, జనవరి04(కెరటం ప్రతినిధి)**

1963వ సంవత్సరంలో జూన్ 10వ తేదీన మౌంట్ ఫోర్ట్ బ్రదర్స్ చేత స్థాపించబడిన చుంచుపల్లి మండల పరిధిలోని ధన్‌బాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల 60ఏండ్లు పూర్తి చేసుకుని వజ్రోత్సవ సంబరాలు జరుపుకోబోతున్న సందర్భంగా ఈ నెల 8వ తేదీన 6కె రన్ నిర్వహించనున్నట్టు సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్సిపల్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం సెయింట్ జోసెఫ్ స్కూల్ నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్సిపల్ రాజశేఖర్‌రెడ్డి మాట్లా డుతూ.. ఈ బొగ్గుగని ప్రాంతంలో వెలసిన సెయింట్ జోసఫ్ పాఠశాల ఒక విజ్ఞానగని 1963వ సంవత్సరంలో జూన్ 10వ తేదీన మౌంట్ ఫోర్ట్ బ్రదర్స్ చేత స్థాపించబడింది. పాఠశాల ప్రగతి ప్రస్థానంలో ఎంతోమంది బ్రదర్ల చేత పాఠశాల అభివృద్ధి చెందుతూ, నేర్చుకోవాలనే ఆసక్తిని కలిగించేలా విద్యా ప్రణాళికలను అమలు చేస్తూ, నవతరానికి నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తూ, సాహితీ, సాంస్కృతిక, క్రీడా, విద్యా విషయాలలో తనదైన ముద్రను సెయింట్ జోసఫ్ పాఠశాల చాటుకుందని తెలిపారు. వజ్రోత్సవ వేడుకల సందర్భంగా ఈ నెల 8న ఉదయం ఏడు గంటలకు లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని సెంట్రల్ పార్క్ నుంచి కొత్తగూడెం ప్రకాశం స్టేడియం వరకు 6కె రన్ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ రన్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ లౌకిక ప్రపంచంలో ఎంతో మందిని, అభివృద్ధి పథంలో నడిపించి, విజయ శిఖరాలు అధిరోహించేలా వారందరిని ప్రోత్సహిస్తూ వారికి చుక్కానిలా మారి, వారి హృదయాకాశంలో నిత్యం తమ పాఠశాల వెలుగొందుతుందని, ఇంతింతై అన్నట్లు పాఠశాల దినదినాభివృద్ధి చెందుతూ 2013వ సంవత్సరంలో అంబరాన్నంటేలా స్వర్ణోత్సవ సంబరాలను జరుపుకుందన్నారు. సమకాలీన పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కావల్సిన నైపుణ్యాలను వారికి అందిస్తూ, వారి మస్తిష్కాలకు మెరుగులు దిద్దేలా విద్యార్థుల సర్వతోముఖాభివృధికి సానపెట్టుగా మారి, భవిష్యత్తుతరానికి విజ్ఞానవంతులైన యువ తరంగాన్ని, సమాజానికి ఉన్నత వ్యక్తులను అందిస్తోందన్నారు. ఈ సంవత్సరం అరవై వసంతాల అద్భుత వజ్రోత్సవ సంబరాలకు సంసిద్ధం కాబోతుందని, దానిలో భాగంగా పాఠశాల పూర్వవిద్యార్థులంతా కలిసి జనవరి 8వ తేదీన సెంట్రల్ పార్క్ నుండి ప్రకాశం స్టేడియం వరకు 6కె రన్ నిర్వహించడం జరుతుందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు తప్పక 6కె రన్‌లో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ వజ్రోత్సవ సంబరాల్లో భాగంగా ఫిబ్రవరి 4వ తేదిన పాఠశాల పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం జరగనుందని, ఫిబ్రవరి 5వ తేదిన పాఠశాల వజ్రోత్సవ సంబరాలను అంగరంగ వైభవంగా జరుపుకో నుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బ్రదర్ జోసెఫ్, పూర్వ విద్యార్థుల కమిటీ ప్రెసిడెంట్ పి.శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ రాజు కిరణ్, అడ్వైజర్ సాయి కృష్ణ, మోబి పాష షేఖ్‌స్పియర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ డాక్టర్ మాలతి కవిత, ప్రవీణ్ కిరణ్, సూర్య, డివి, ప్రవీణ్, రోహిణి, దేవి, ఆదర్శ్, అనిరుద్, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.










# లక్ష్మీదేవిపల్లి ఎస్ఐకి ఘన సత్కారం

## సన్మానించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య

**శామ్, జనవరి04(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం నియోజకవర్గం లక్ష్మీదేవిపల్లి మండల ఎస్ఐ ప్రవీణ్‌కి రాష్ట్ర ఉత్తమ పోలీస్ స్టేషన్ అవార్డు అందుకున్న సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో ప్రవీణ్ ఘనంగా సన్మానించారు. అనంతరం శాంతయ్య మాట్లాడుతూ బాధ్యతను చాలా క్రమశిక్షణగా చేయడం వల్ల ఈ గౌరవం దక్కిందని, ఇలానే బాధ్యతను లక్ష్మీదేవిపల్లి మండల యువత చెడు త్రోవకి వెళ్ళకుండా మంచి నడవడికలో నడిచే విధంగా చేయాలని తెలిపారు. రాబోవు రోజుల్లో మీరు మరెన్నో పదవులు అధిరోహించాలని తెలిపి శుభాకాంక్షలు తెలి పారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పట్టణ అధ్య క్షులు బొమ్మిడి మల్లికార్జున్, చుంచుపల్లి మండల అధ్యక్షులు అంతోటి పాల్, కొత్తగూడెం పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వర్లు, కొత్తగూడెం నియోజక వర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఏలూరి రాజేష్ కుమార్, కొత్తగూడెం పట్టణ మహిళ మైనార్టీ అధ్యక్షు రాలు జేరినా, కొత్తగూడెం పట్టణ యస్సీ సెల్ అధ్యక్షు లు కల్లేపల్లి రాజా, కాంగ్రెస్ నాయకులు కలిపాక సత్యనారాయణ, సారంగా ఫణి, ఫైజుద్దిన్, చుంచుపల్లి మండల మైనార్టీ నాయకులు పక్రొద్దిన్, బట్టు గణేష్, భూక్యా శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.



### శిక్షణ కార్యక్రమానికి హాజరైన పోట్ల

**శామ్, జనవరి04(కెరటం ప్రతినిధి)**

హైదరాబాద్‌లోని గాంధీ ఐడియాలోజి కేంద్రం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ శిబిరంలో ధరణీ, హత్ సే హత్ జోడో, ఎన్నికల నిబంధనలు, నియమావళి, మీడియా రిలేషన్స్, వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, టిపిసిసి ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, కొత్తగూడెం నియోజకవర్గ టిపిసిసి సభ్యులు ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జె బి శౌరి, వైరా నియోజకవర్గ టిపిసిసి సభ్యులు ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు మాళోత్ రాందాస్ నాయక్ పాల్గొన్నారు.